**116**
**ధారావాహిక**



# జాయ సేనాపతి


మత్తి భానుమూర్తి ...
99893 71284


## చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** ఓ పూర్తిస్థాయి నాట్యమేళంతో దక్షిణరాజ్య యాత్రకు కదిలాడు జాయపచోడుడు. వివిధ రాజ్యాలగుండా పోయిపోయి చేరరాజ్యం దక్షిణ సముద్ర అంచులవరకూ వెళ్లింది ఆ మేళం. అక్కడి నుండి కదిలి దేవాలయాలు, శిల్ప, నాట్య, సంగీత సంప్రదాయాలు చూస్తూ, పోల్చి, బేరీజు వేసుకుంటూ చేర రాజ్యాలు, తమిళ రాజ్యాల్లోని రాజాస్థానాలు, దేవాలయ స్థానాపతులు బలవంతం చేస్తే నృత్తం ప్రదర్శిస్తున్నాడు. కానీ, ఎందుకో మనసు లగ్నం కావడం లేదు. ఏదో చేశాడు అంటే చేశాడు!

చేర రాజ్యంలోని కథాకళి నృత్తం జాయచోడుణ్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. అసలు సిసలు నృత్తంగా దానిని హృదయానికి హత్తుకున్నాడు. తమిళరాజ్యాలలోని దేవాలయాలు జాయచోడుణ్ని విస్తుగొలిపాయి. వాటిని ఎంత విశాలంగా నిర్మించారంటే.. రానున్నకాలంలో వాటిని పడగొట్టడం, పూర్తిగా తొలగించడం దాదాపు అసాధ్యం. భవిష్యత్తులో ఎవరు పాలకులైనా.. అవి అజరామరంగా నిత్య ధూపదీప నైవేద్యాలతో కళకళలాడుతూనే ఉంటాయి. అన్నిటినీ చూస్తూచూస్తూ చిదంబరం చేరుకుంది జాయచోడుని నాట్యమేళం.

చిదంబరం!!

ప్రపంచ అద్భుతాలలో అద్భుతం చిదంబర క్షేత్రం! భారతీయ మతవిశ్వాసాలు, జ్ఞానసంపన్నత, శాస్త్ర పరిణతి.. అన్నిటి సమ్మేళనమే ఈ నటేశ నాట్యక్షేత్రం.

శివ రూపాలలో నటరాజ రూపం ఓ అద్భుతం.. ఊహాతీతం. ఎక్కడైనా లింగరూపమే స్థూపాకారంగా ఉంటుంది. పెద్ద కాకపోతే చిన్న. మరే శైవక్షేత్రంలోనైనా, అసలు ఏ దైవక్షేత్రంలోనయినా, ఏ దేవుడైనా నాట్య రూపంలో చూడలేదు. ఇక్కడ మానవరూపం.. పైగా నాట్యరూపం.. అంటే కళాత్మకతతో ఆధ్యాత్మికత.. ఇదొక గొప్ప రూపకల్పన. మహామహా శివభక్తులు, మఠపెద్దలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞులు వచ్చి చూసి నిర్ఘాంతపోతున్నారు.

భగవంతుని మొత్తం కార్యకలాపాలన్నిటినీ గుదిగుచ్చి నటరాజ రూపం కల్పించారనిపించింది జాయచోడునికి. అదే నృత్తం. అదే తాండవం. అది పూర్తి జీవితానికి ప్రతీక. అది ఆనంద తాండవంతో మొదలయ్యి ప్రళయ తాండవంతో అంతం అవుతుంది. బతుకంతా లయాత్మకమే. ఈ లయబద్ధమైన మొత్తం విశ్వాంతరాళాన్ని నటరాజ విగ్రహరూపం చెబుతోంది. ఇది ఒక్కరోజులో రూపకల్పన పూర్తయిన రూపం కాదు. ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నెన్నో ఆలోచనలతో సృష్టి – స్థితి – లయ సమ్మేళనానికి ఓ ఆకారం కల్పిస్తున్నారు.

ఎవ్వరో తెలియని ఆ మహాస్రష్టలకు కోటి దండాలు!

ఈ గుడి అదేదో భూమధ్యరేఖపై ఉన్నదట. ఈ రేఖపొడవునా పైన మరెన్నో గుడులు ఉన్నాయట. వాటిపై ఆసక్తి లేదు జాయచోడునికి.

ఆ నటరాజమూర్తి! పెద్దలు, ఆలోచనాపరులు శివునికి నాట్యరూపం కల్పించడంలో పరమార్థమేమిటి.. అదే జాయచోడుణ్ని రంజింపజేస్తోంది. రగిలింపజేస్తోంది.

ఓ మూల కూర్చుని తదేకంగా ఆ నాట్యమూర్తినే చూస్తుంటాడు.

అప్పటికి చిదంబరం వచ్చి రెండు మాసాలయ్యింది.

ఏదో స్తబ్ధత.. కాదు కాదు. అయోమయం!

వెళ్లాలని లేదు. ఉండాలని కూడా లేదు. అన్నిటినీ, అందరినీ వదిలి ఇక్కడే ఉండిపోతే!?

ఊహు!! అది తన తత్వం కాదు. సమాజం నుండి పారిపోవడం తనకు అంగీకారం కాదు.